క్లుప్తంగా

రేపటి నుంచి నూకాలమ్మ ఆలయ వార్షికోత్సవం

జంగారెడ్డిగూడెం : పట్టణంలో కొలువై ఉన్న నూకాలమ్మ అలయ 4వ వార్షిక వేడుకలు ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న గణపతిపూజ, పుణ్యాహవచనం, ప్రధాన కలశ స్థాపన, 18న అమ్మవారి మూల మంత్ర విశేష కళా హోమం, అష్టోత్తర శత కలశాభిషేకం, అనంతరం స్వర్ణవర్ణ పూర్ణ కవచలాంకృత అలంకారంతో పూజలు, 19న పంచామృతాభిషేకం, పుష్కర జలాలతో జలాభిషేకం, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు

చింతలపూడి : తంటిపూడి ఫౌండేషన్ ఫర్ బహుజన్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో చింతలపూడిలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. స్థానిక బస్టాండ్ ప్రాంగణంలోను, చింతలపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాలను ఎంపీడీవో మణికుమారి, మున్సిపల్ కమిషనర్ రాంబాబు, డిప్యూటీ తహసీల్దార్‌లు ప్రారంభించారు. ఫౌండేషన్ సెక్రటరీ తంటిపూడి వరప్రసాద్ మాట్లాడుతూ జూన్ చివరి వరకు చలివేంద్రాలను నిర్వహిస్తామన్నారు. తీవ్రమైన వేసవి పరిస్థితుల దృష్ట్యా ఈ చలివేంద్రాలను ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

సర్ ఆర్థర్ కాటన్‌కు నివాళి



కొయ్యలగూడెం పీడబ్ల్యూడీ కార్యాలయంలో కాటన్‌కు నివాళి అర్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : అపర భగీరధుడు సర్ ఆర్థర్ కాటన్ మహాశయుని 220వ జయంతి కార్యక్రమం కొయ్యలగూడెంలోని పీడబ్ల్యూడీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఇరిగేషన్ ఏఈ చదలవాడ భాస్కరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈ రవీంద్ర, అగ్రికల్చర్ మండల అడ్వైజరీ కమిటీ బోర్డు చైర్మన్ గంటా సీతారామయ్య (రాంబాబు) ముఖ్య అతిథులుగా హాజరై కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాటన్ దొర అంటూ భారతీయులు ముద్దుగా పిలుచుకునే ఆ మహనీయుడు తన జీవితం మొత్తం భరతమాత సేవకే వినియోగించాడని కొనియాడారు. ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వానికి ధవళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ ఆవశ్యకతను తెలియజెప్పి సుమారు ఐదేళ్ల వ్యవధిలో ప్రాజెక్టు నిర్మించారని, అందుకనే ఆయన అపర భగీరధుడు అయ్యారన్నారు. కాటన్ విగ్రహంతో పాటుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య, కానూరి లక్ష్మణరావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లైబ్రేరియన్ యు.రాముడు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీ తేలే శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు మారిశెట్టి శ్రీనివాస్, కొనకళ్ళ రాము, కొల్లూరు యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

జంగారెడ్డిగూడెం : ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక బాలాజీ నగర్‌కు చెందిన తానేటి వీర్రాజు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్న తన భార్య ధనలక్ష్మిని తీసుకువచ్చేందుకు మోటార్‌సైకిల్‌పై జంగారెడ్డిగూడెం వస్తుండగా స్థానిక మార్కెట్ యార్డు సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకింది. దీంతో తీవ్రగాయాలపాలైన అతడ్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీర్రాజు భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు



ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు గీసిన చిత్రాలు

లింగపాలెం : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు జూన్ 21న బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయాధికారిణి వి.రమణ తెలిపారు. అలాగే చిన్నారులచే చందమామ బాలమిత్రల కథలు, బొమ్మరిల్లు కథలు చదవించారు.

గ్రంథాలయంలో పద్య పఠనం

ద్వారకాతిరుమల : స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారు పాప సోమవారం విద్యార్థులచే పద్య పఠనం చేయించారు. ముందుగా తెలుగు కవులు రచించిన పద్యాలను విద్యార్థులతో కంఠస్తం చేయించి, వాటిని వారితో చెప్పించారు. తెలుగు భాష వ్యవహార భాషగా ఆవిర్భవించడానికి, దేవ భాషలందు తెలుగు లెస్స అని కొనియాడడానికి ప్రాచీన, ఆధునిక కవులు చేసిన కృషిని ఆమె విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి, పాఠకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గడప గడపకు



శ్రీనివాసపురంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా



కృష్ణాపురంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని శ్రీనివాసపురంలో నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ఎమ్మెల్యే ఎలీజా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటినుంచి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ అర్హులకు సంక్షేమ పథకాలు అందిచండంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనించేందుకు కృషి చేస్తున్నారన్నారు. విద్య, వ్యవసాయ, వైద్య రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి అనేక పథకాలను ప్రవేశపెట్టిందని ఎలీజా అన్నారు. నాడు–నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలను అందించడం, ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. శ్రీనివాసపురంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అనేక మందికి ఇళ్లస్థలాలు, ఇళ్లు ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. ఈ గ్రామంలో రూ.15 కోట్ల సంక్షేమ పథకాలు అందించామని, అలాగే రూ.7 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు మళ్లీ జగన్మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలని కోరుకోవడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, సచివాలయాల మండల కన్వీనర్ గురజా పార్థసారథి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో గడపగడపకు

బుట్టాయగూడెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంతో గడపగడపకు కార్యక్రమానికి ప్రజల నుంచి ఆత్మీయ స్వాగతం లభిస్తుందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని లక్ష్మందుగూడెం సచివాలయ పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో సోమవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బాలరాజు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు సకాలంలో అందుతున్నాయా అని ఆరా తీశారు. వలంటీర్ల ద్వారా నేరుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలు తెలియజేయడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు అమలు చేయని విధంగా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచారని అన్నారు. నవరత్న పథకాల్లో అర్హులైన వారికి పింఛన్లు, జగనన్న తోడు, జగనన్న కాలనీలు, అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన వంటి అనేక పథకాలను అమలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, ఎంపీపీ కారం శాంతి, జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్ మడకం రామలక్ష్మీ, ఎంపీటీసీ చారపు సుజాత, నాయకులు రేపాకుల చంద్రం, కలగర నాని, చింతపల్లి వెంకటేశ్వరరావు, అనుపోజు మురళీ, ప్రకాశ్, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, ఉయికే బొజ్జి, మాల్చి వెంకన్నబాబు, కుంజా వెంకటేశ్వరరావు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కన్నాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

కొయ్యలగూడెం: కన్నాపురం గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోడ్డటి నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారి సమస్యలు తెలుసుకుంటారన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సచివాలయాల కన్వీనర్లు పాల్గొనాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన



కోయరాజమండ్రిలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం : మండలంలోని కోయరాజమండ్రిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల వివరాలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత రెండు రోజుల నుంచి ఎండలతో పాటు తీవ్రమైన వడగాల్పులు వీస్తున్నందున కూలీలకు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కూలీలకు సూచించారు. కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పని చేసే ప్రదేశాల్లో తప్పనిసరిగా మంచినీటి సదుపాయం కల్పించాలన్నారు. పనుల వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్ సరియం సూర్యచంద్రంను అడిగి తెలుసుకున్నారు. కోయరాజమండ్రి పరిధిలో ప్రస్తుతం పంట కాల్వ పనులు జరుగుతున్నట్లు చెప్పారు. 493 మంది కూలీలు పనులకు వస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, నాయకులు బానోతు శ్రీరామ్ మూర్తి, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు తమ పంటను విక్రయించి లబ్ధి పొందాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు పేర్కొన్నారు. సోమవారం బయ్యనగూడెం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ కోరుకొండ బాపిరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మండల పరిషత్ ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి గంగరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బయ్యనగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వద్ద రైతు భరోసా కేంద్రం సహకారంతో కొనుగోళ్లు నిర్వహిస్తామన్నారు. క్వింటాకు రూ.1,962 గిట్టుబాటు ధర ప్రభుత్వం కల్పించిందన్నారు. పండించిన వరి, మొక్కజొన్న మొత్తం కొనుగోలు చేస్తామన్నారు. బవిరిశెట్టి సుబ్బారావు, సంఘ కార్యదర్శి కొడపాక శ్రీమన్నారాయణ, ఆర్‌బీకే సిబ్బంది, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం



బాధితురాలికి నిత్యావసరాలు, నగదు అందజేస్తున్న దృశ్యం

పోలవరం రూరల్ : ఎల్ఎన్‌డీపేట గ్రామంలో సోమవారం జక్కు ఏసమ్మకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇంటితోపాటు, గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, తహసీల్దార్ బి.సుమతి ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని పరామర్శించారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన సహకారం అందిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి రూ.5వేలు మంజూరు చేస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి రూ. 2500 నగదును ఏసమ్మకు అందజేశారు. అలాగే 25 కేజీల బియ్యం, రెండు కేజీల కంది పప్పు, పంచదార బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఇళ్ల కళ్యాణ్, ధూళి బాపిరాజు పాల్గొన్నారు.

స్పందనలో 11 అర్జీల స్వీకరణ



లింగపాలెంలో అర్జీలు స్వీకరిస్తున్న నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



జంగారెడ్డిగూడెంలో ఆర్డీవో ఝాన్సీరాణికి ఫిర్యాదు చేస్తున్న నాగులగూడెం గ్రామస్తులు

లింగపాలెం : లింగపాలెం సబ్‌డివిజన్ స్థాయిలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రతి సోమవారం మండలంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి అర్జీదారుల నుంచి అంతగా స్పందన ఉండడం లేదు. చాల వరకు ప్రజలు ఏలూరులో నిర్వహించే స్పందన కార్యక్రమంలో తమ అర్జీలను అందజేసేవారు. దీంతో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ చొరవ తీసుకుని సోమవారం డివిజన్‌స్థాయిలో స్పందన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి 11 అర్జీలు అందాయి. యర్రవారిగూడెం గ్రామానికి చెందిన యర్రా నాగేశ్వరరావు ఆన్‌లైన్ తన పొలం మరొకరి పేరున ఉందని, తన పేరిట ఆన్‌లైన్ చేయాలని అర్జీ అందజేశారు. కె గోకవరం గ్రామానికి చెందిన పీఎల్ నరసింహరావు తన పొలంలోకి వెళ్లేందుకు దారి కల్పించాలని, భోగోలు సర్పంచ్ తాడేపల్లి శాంతరావు తమ గ్రామంలో ఉన్న రాజన్న కులానికి సంబంధించి కులధ్రువీకరణ పత్రం ఇవ్వాలని, , లింగపాలేనికి చెందిన తగరం మరియమ్మ తన భర్త చింతయ్య (37) 2020లో మృతి చెందినా ఇంతవరకు వైఎస్సార్ బీమా రాలేదని అర్జీలు అందజేశారు. తోచలకరాయుడుపాలెం గ్రామానికి చెందిన చలగుళ్ల రామ్మోహనరావు తన కుమారుడికి డబ్బులు చెల్లించి ఆపరేషన్ చేయించామని, ఆరోగ్యశ్రీ వర్తించలేదని ఫిర్యాదు చేశారు. ఈ అర్జీలను తక్షణం పరిష్కరించాలని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో ఎస్.ఆశీర్వాదం, ఎస్సై పి చెన్నారావు, ఆర్ఐ పి.బలరామకృష్ణ, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత మునునూరి వెంకటేశ్వరరావు, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ మస్తర్లు వేస్తున్నారని ఫిర్యాదు

జంగారెడ్డిగూడెం : నాగులగూడెంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నకిలీ మస్తర్లు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో అర్జీ అందజేశారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గోలి ప్రణీతరెడ్డి పనికి హాజరుకాని వారికి, సొంతవారికి దొంగ మస్తర్లు వేస్తున్నారని, దీంతో ఉపాధి హామీ సొమ్ములు దుర్వినియోగమవుతున్నాయని సంబంధిత అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదుచేసిన వారిలో పొద్దుటూరు మధు, టేకుముడి, సింహాద్రి, కనికెళ్లి బాలస్వామి తదితరులు ఉన్నారు.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం



చింతంపల్లిలో రీసర్వే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి : భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న శాశ్వత భూహక్కు – భూ రక్ష పథకం ద్వారా భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని చింతంపల్లి గ్రామంలో డ్రోన్ సర్వే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రోన్‌ల వినియోగం, వాటి పనితీరును, సర్వే ద్వారా వస్తున్న ఫలితాలను అధికారులు ఎమ్మెల్యే ఎలీజాకు వివరించారు. అనంతరం సర్పంచ్ తాండ్ర రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో నూరేళ్ల తరువాత సమగ్ర స్థాయిలో భూముల రీ సర్వే జరుగుతోందని తెలిపారు. పూర్తిగా ఆధునిక పద్ధతుల్లో డ్రోన్లను వినియోగించి సర్వే నిర్వహించి సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దశాబ్దాల నాటి భూ వివాదాలు పరిష్కారం కావడంతో పాటు భవిష్యత్తులో కూడా ఎలాంటి భూ వివాదాలు రాకుండా రికార్డులను రూపొందిస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణ జ్యోతి విజ్ఞప్తి చేశారు. మండలంలో 74,660.37 ఎకరాల భూమికి సంబంధించి 302.15 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఈ డ్రోన్ రీ సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. జూన్ 9 వరకు డ్రోన్ రీసర్వే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, ఎంపీపీ డా.బి.రాంబాబు నాయక్, సర్పంచ్ తాండ్ర రామకృష్ణారావు, సచివాలయాల మండల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, యడ్ల మోహన్‌రావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో సోమవారం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ప్రథమ కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అర్చకులు గుడిపూడి శేషాచార్యులు, చానుమల్లి శ్రీనివాస పార్థసారథిలచే అష్టోత్తర శత కలశాభిషేకం ఉదయం 6 గంటలకు నిర్వహించారు. శ్రీ శోభకృత్ నామ సంవత్సర వైశాఖ బహుళ ఏకాదశి పురస్కరించుకొని శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి వారి కల్యాణోత్సవం సాయంత్రం ఏడు గంటలకు వైభవంగా నిర్వహించారు. దంపతుల చేత కల్యాణ తంతు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ఆలయ కమిటీ చైర్మన్ ముద్దు గోపి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పంగిడిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో కలిసిన పూర్వ విద్యార్థులు




చింతలపూడి సుబ్బరాజు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

జంగారెడ్డిగూడెం రూరల్ : జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000 – 2005 సంవత్సరం వరకు విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. పంగిడిగూడెం అన్నపూర్ణ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. చదువుకున్న రోజుల్లో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. విద్య నేర్పిన తమ గురువులను పూర్వ విద్యార్థులు సత్కరించారు. పూర్వ విద్యార్థులంతా ఒక వేదికపై కలిసేందుకు కృషి చేసిన నున్నా పవన్ కుమార్‌కి మిత్ర బృందం కృతజ్ఞతలు తెలిపింది.

చింతలపూడిలో...

చింతలపూడి : స్థానిక సుబ్బరాజు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1999–2000 నాటి 7వ తరగతి బ్యాచ్ బాల్య స్నేహితులు సోమవారం హైస్కూల్ ఆవరణలో కలుసుకున్నారు. సుమారు 23 ఏళ్ల తరువాత కలుసుకున్న వారంతా కలిసి సందడి చేశారు. ఒకరిని ఒకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకుని పాత మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. సాయంత్రం వరకు విద్యార్థులంతా ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యా బుద్ధులు నేర్పి ఉన్నతంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

20 నుంచి రోటరీ క్రీడా పోటీలు



రోటరీ వేసవి వినోదం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : చిన్నారులకు వేసవి సెలవుల్లో వినోదం, విజ్ఞానం ముఖ్యంగా క్రీడాస్ఫూర్తిని అందించేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు రోటరీ అధ్యక్షుడు దాకారపు కృష్ణ తెలిపారు. జంగారెడ్డిగూడెంలో సోమవారం కార్యక్రమ కరపత్రాన్ని రోటరీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ మే 20 వ తేదీ నుంచి 7 నుంచి 15 ఏళ్ల వయస్సు బాలబాలికలకు 6 అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. చదరంగం, వక్తృత్వం, వ్యాసరచన, శాస్త్రీయ, ఆధునిక నృత్యం, బాడ్మింటన్, పాటలు తదితర అంశాల్లో పోటీలు ఉంటాయని, ఆసక్తి ఉన్న చిన్నారులు వారికి ఇష్టమైన అంశంలో పాల్గొనేందుకు సెల్‌ఫోన్ ద్వారా 19వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అయినపర్తి చంద్రశేఖర్ (చదరంగం), గణిత ఆనంద ప్రసాద్ (వక్తృత్వం), లింగాల నాగేశ్వరరావు (వ్యాసరచన), తడికమళ్ళ నవీన్(నృత్యం), బవిరిశెట్టి తిలక్ (బ్యాడ్మింటన్), కొమ్ముకూరి నాగేశ్వరరావు (పాటలు) అంశాల్లో అధ్వర్యం వహిస్తారని తెలిపారు. రోటరీ కార్యదర్శి ఉడా రాంగోపాల్(గోపీ), రోటరీ యువజన విభాగ చైర్మన్ రాఘవరాజు ఆదివిష్ణు, మానికల గంగాధర్, మారిశెట్టి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్



జంగారెడ్డిగూడెంలో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ని అరెస్ట్ చేయాలని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి పిలుపునిచ్చారు. మహిళా రెజ్లర్ల న్యాయమైన పోరాటానికి సంఘీభావంగా ఇఫ్టూ, పీవోడబ్ల్యూ, పీవైఎల్, పీడీఎస్‌యూ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జంగారెడ్డిగూడెం బోసుబొమ్మ సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె పోలారి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో భారత దేశ క్రీడా విజయ పతాకాన్ని రెపరెపలాడించిన మహిళా మల్లయోధులు (రెజ్లర్ల) పై లైంగిక వేధింపులకు పాల్పడ్డ యూపీ బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ని వెంటనే అరెస్ట్ చేసి, ఆయనపై తక్షణ చర్యలను తీసుకోవాలన్నాని డిమాండ్ చేశారు. పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వెట్టి భారతి, పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఈ.భూషణం, పీవైఎల్ డివిజన్ నాయకులు తగరం బాబురావు మాట్లాడుతూ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం కోసం టాస్క్‌ఫోర్స్ కమిటీల ఏర్పాటు



ద్వారకాతిరుమల పీహెచ్‌సీ ఆవరణలో మాట్లాడుతున్న స్నేహన్

ద్వారకాతిరుమల : అందరికీ ఆరోగ్యం అందించడానికి ప్రభుత్వం గ్రామస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేసిందని సచివాలయాల శాఖ సామాజిక ప్రవర్తన మార్పు సమాచార విభాగం జిల్లా కోఆర్డినేటర్ టీఎన్ స్నేహన్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో మండల వైద్యాధికారి డాక్టర్ బాలు అధ్యక్షతన సోమవారం గ్రామ స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో స్నేహన్ మాట్లాడుతూ 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో 1, 6 సాధన కోసం ఏర్పాటైన ఈ టీం ప్రతి నెలా సమావేశం ఏర్పాటు చేసుకుని ప్రజల ఆరోగ్యం గురించి చర్చించుకుని, పూర్తిస్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, యుక్త వయస్సు బాలల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. యుక్త వయస్సు బాలికలకు క్రమం తప్పకుండా రక్తశాతం తెలుసుకునే పరీక్షలు జరపాలన్నారు. అలాగే పలు సూచనలు, సలహాలనిచ్చారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, పీహెచ్ఎన్ లక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు ఎ.నాగమణి, కె.హైమావతి, మహిళ పోలీస్ పి.లక్ష్మీ సుజన, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పల్గొన్నారు.